క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో కనుమ పండగను పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. ఆలయంలోని ఉప ఆలయాల్లోని అమ్మవారు, స్వామివారికి పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా కావమ్మ తిరునాళ్లు


కావమ్మ, మారెయ్యలను దర్శించుకుంటున్న భక్తులు

సామర్లకోట: పట్టణంలోని రజక పేటలో ఉన్న కావమ్మ తిరునాళ్ల ఉత్సవాలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. సంక్రాంతి సందర్భంగా మంగళవారం ప్రారంభమైన ఉత్సవాలు గురువారంతో ముగుస్తాయి. కనుమ పండగ, కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. కావమ్మ, మరెయ్యలను దర్శించుకుని, మొక్కులు తీసుకున్నారు. ఏలేరు కాలువ ఆవలివైపు కావమ్మ ఆలయాన్ని 253 ఏళ్ల క్రితం నిర్మించారు. సంక్రాంతి నుంచి ముక్కనుమ వరకు ఉత్సవాలు జరుపుతారు. తిరునాళ్లకు వచ్చిన గర్భిణులు పండ్లను ఆలయం వద్ద బావిలో వేస్తారు. అది తేలితే మగ బిడ్డగా, మునిగితే ఆడ బిడ్డగా భావిస్తారు. ఈ మేరకు అనేక మంది గర్భిణులు బావిలో పండ్లు వేశారు. మారెయ్య, కావమ్మ వారసులు సుకపట్ల ఆదినారాయణ, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఉత్సవాలను తిలకించడానికి అనేక గ్రామాల వారు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తుల కోసం పిఠాపురం బ్రాంచి కెనాల్‌లో నీటిలో బెలూన్ ఏర్పాటు చేసి, చిన్నారులను ఆకట్టుకున్నారు. చిన్నారులు ఆ బెలూన్‌లో విన్యాసాలు చేశారు.

పూడికతీత పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



మఠం సెంటర్‌లో పూడికతీతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సామర్లకోట: పట్టణంలోని మఠం సెంటర్‌లో జరుగుతున్న పూడికతీత పనులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం పరిశీలించారు. సామర్లకోట–పెద్దాపురం రోడ్డు మఠం సెంటర్‌లో రోడ్డు నిర్మించినప్పటి నుంచి 35 ఏళ్లుగా డ్రైనులో పూడికతీత జరగలేదు. దాంతో మఠం సెంటర్ సెంటర్ వద్ద కల్వర్టు దిగువ భాగంలో పూడికలు పెరిగిపోయాయి. కూరగాయల మార్కెట్, మఠం సెంటర్, అయోధ్య రామపురం తదితర ప్రాంతాలు కొద్ది పాటి వర్షానికే ముంపునకు గురవుతున్నాయి. దాంతో మున్సిపాలిటీ నిధులతో మఠంసెంటర్‌లోని కల్వర్టు వద్ద పూడికతీత పనులు వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. డ్రైనుపై ఉన్న ఆక్రమణదారులు పూడికతీతకు సహకరించాలన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి వెంకటఅప్పారావు చౌదరి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, గౌడ కార్పొరేషన్ డైరెక్టరు బదుగు శ్రీకాంత్, గోలి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మ అమ్మవారి సంబరం

పెద్దాపురం: పట్టణంలోని జగ్గంపేట రోడ్డులో ఉన్న సత్తెమ్మ అమ్మవారి సంబరం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. భారీగా భక్తులు గంటల తరబడి క్యూలో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సంబరాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు పప్పల నాగరాజు ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఇన్‌చార్జి సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో ఎస్సై మౌనిక బందోబస్తు కల్పించారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 108 గరగలతో నృత్యం, కాళికా వేషాలు, లంబాడి, ఆర్కెస్ట్రా, బ్యాండ్‌మేళాలు, ఒంటెలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


కనుమ సందర్భంగా పూజలందుకున్న గోమాత


దుర్గాడ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో గోపూజలు


దుర్గాడలో గోమయానికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు


సామర్లకోట ఉప్పువారి సత్రంలో చేస్తున్న వస్త్రదానం

వెల్లివిరిసిన సంక్రాంతి

- ఘనంగా కనుమ పండగ
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- సంబరాలతో కళకళలాడిన గ్రామాలు
- నేటితో ముగియనున్న వేడుకలు

పిఠాపురం: ఏడాదికి ఒకసారి వచ్చే సంక్రాంతి పండగ అన్ని వర్గాల ప్రజలకు పెద్ద పండగే. పంటలన్నీ చేతికంది, గాదెలన్ని ధాన్యం రాసులతో నిండిపోయే ధనుర్మాసంలో వచ్చే మూడు రోజుల ముచ్చటైన సంక్రాంతి.. పిల్లల నుంచి పెద్దల వరకు అందరిలోనూ నూతన కళను రేకెత్తించింది. పల్లెలు పట్టణాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మహిళలు తెలుగుతనం ఉట్టి పడేవిధంగా సంక్రాంతి విశిష్టతను చాటేలా ముగ్గులు వేసి తమ వాకిళ్లకు కొత్త అందాలు తెచ్చారు. డూడూ బసవన్నలు, హరిదాసులు, బుడబుక్కల వాళ్లు, జంగమ దేవరులు వీధుల్లో తిరుగుతూ తమ కీర్తనలతో ఆకట్టుకున్నారు. ప్రతి ఏటా కొత్త శోభను తీసుకొచ్చే ఏకైక పండగ కావడం వల్లే సంక్రాంతి పెద్ద పండగ అయింది. కొత్త సినిమాలు, దుస్తులు, ధాన్యం, కోడి పందేలు, కొత్త అల్లుళ్ల రాక, బావమరదళ్ల సరసాలు, అల్లుళ్ల అలకతో అత్తవారింట సందడి నెలకొంది. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రతి ఇంటా పిండి వంటలు ఘుమఘుమలాడాయి. రైతుల ఇళ్లల్లో ముందుగా తెచ్చిన ధాన్యంతో అటుకులు ఆడించడం ఆనవాయితీగా మారడంతో పాటు, ప్రతి గ్రామంలోనూ అటుకులు, కొత్త దుస్తులను తమ పెద్దల పేరు చెప్పి ఇతరులకు దానం చేయడంలో పెద్దలు బిజీగా మారారు. అలాగే వివిధ గ్రామాలలో పలువురు యువతులు పోటీపడి వివిధ రకాల రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు.

భక్తులతో ఆలయాల కిటకిట

ఉత్తరాయణ పుణ్య కాలంలో తొలిసారి వచ్చే మకర సంక్రాంతి రోజున బియ్యం, నువ్వులతో శివుడిన్ని అభిషేకిస్తే మంచిదన్న నానుడి ఉండడంతో, గ్రామస్తులు దీనికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. కొత్తపల్లి, పిఠాపురం అయ్యప్పస్వామివారి ఆలయాల్లో మకరజ్యోతి దర్శనాలు కనులపండువగా జరిగాయి. దీంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉత్తరాయణ పుణ్యకాలంలో చేసే జపాలు, పారాయణలు, దానాలు అనేక రెట్ల ఫలితాన్ని ఇస్తాయని, అష్టైశ్వర్యాలు కలిగిస్తాయని శాస్త్రాలు చెబుతుండడంతో, మకర సంక్రాంతి రోజున దానాలు చేయడానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. పలువురు ధాన్యం, బంగారం, వస్త్రం, ఆవు, కాయగూరలు, చెరకు, నువ్వులు దానం చేశారు. వీటిని దానం చేయడం వల్ల విశిష్ట ఫలితాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. మకరరాశికి అధిపతి శనీశ్వరుడు కావడంతో, ఆయనకు ఇష్టమైన నువ్వులను సంక్రాంతి నాడు దానం చేశారు. అలాగే శివాలయాల్లో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా గొల్లప్రోలు మండలంలో ఆనవాయితీ ప్రకారం నిర్వహించిన బండ్లపై వేషాలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి చివరి రోజు ముక్కనుమను గురువారం జరపనున్నారు.

ఘనంగా గో పూజలు

సంక్రాంతి మరునాడు వచ్చే కనుమ పండగకు విశిష్ట స్థానం ఉంది. పశు సంపదను లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా భావించి పూజించే పండుగే కనుమ. కనుమ రోజున కళకళలాడుతున్న ధాన్యపు రాసులకు రైతులు పూజలు నిర్వహిస్తుంటారు. పశువులను శుభ్రంగా కడిగి, పూల దండలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేస్తారు. పిఠాపురంలో ప్రముఖ పుణ్య క్షేత్రాలైన పాదగయ కుక్కుటేశ్వరస్వామి, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో బుధవారం కనుమ పండగ సందర్భంగా ప్రత్యేక గోపూజలు నిర్వహించారు. పలువురు భక్తులు గోవులకు ప్రత్యేక అలంకరణలు చేసి, వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశాలలను సైతం అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

అంబరాన్నంటిన సంబరాలు

పెద్దాపురం: సంక్రాంతి సంబరాలు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమను పురస్కరించుకుని కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపారు. పలు గ్రామాల్లో మహిళలకు గేమ్ షోలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కాండ్రకోటలో గోదా, రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణాలయంలో గీతా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నూకాలమ్మ ఆలయంలో గోపూజ జరిగింది. సంక్రాంతి వేడుకల్లో భాగంగా కనుమ రోజున స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో గోపూజ నిర్వహించారు. ఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

ఉప్పువారి సత్రం ఆధ్వర్యంలో వస్త్రదానం

సామర్లకోట: పట్టణంలోని ఉప్పువారి సత్రం ధర్మకర్తల ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా వస్త్రదానం చేశారు. కనుమ రోజైన బుధవారం సత్రం ధర్మకర్త ఉప్పు సత్యనారాయణ ఆధ్వర్యంలో వస్త్రదానం జరిగింది. పిఠాపురం రోడ్డులో ఉప్పు సీతారామయ్య పేరున ఆయన కుమారులు సత్యనారాయణ, సూర్యారావు 1941 అక్టోబర్ 30న సత్రం స్థాపించి, 26 ఎకరాల భూమిని దానంగా ఇచ్చారు. భూమిపై వచ్చే ఆదాయంతో బాటసారులకు తాగునీరు, వేసవిలో మజ్జిగ, వస్త్రదానం, మహా శివరాత్రిలో భక్తులకు మజ్జిగ, పాలు పంపిణీ, కార్తిక వన సమారాధనలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సీతారామయ్య మనవడు, సూర్యారావు కుమారుడు సత్యనారాయణ వ్యవస్థాపక ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు.


గొల్లప్రోలు మండలంలో ఆకట్టుకున్న బండ్ల వేషాలు

ముగిసిన సంక్రాంతి సందడి

- ముగ్గులకు సెలవు
- ఉత్సాహంగా కోడి పందేలు

సామర్లకోట: భోగి నుంచి ప్రారంభమైన సంక్రాంతి సందడి కనుమ పండగతో ముగిసింది. సంక్రాంతిని పురస్కరించుకుని భోగి రోజు నుంచి బుధవారం సాయంత్రం వరకు కోడి పందేలను నిర్వహించారు. సంక్రాంతికి సంప్రదాయబద్ధంగా జరిగే కోడి పందేలను ఆయా గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు కుటుంబ సమేతంగా తిలకించారు. గురువారం ముక్కనుమను పురస్కరించుకొని ప్రతి ఇంటి నుంచి రథం ముగ్గుతో వీడ్కోలు పలుకుతారు. కాగా పెద్దాపురం మండలంలో కట్టమూరు, ఆర్బీ కొత్తూరు, పులిమేరు, గుడివాడ, దివిలి గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించారు. అదేవిధంగా సామర్లకోట మండలంలో పనసపాడు, ఉండూరు, వీకే రాయపురం, అచ్చంపేట, మాధవపట్నం గ్రామాల్లోను బరులు ఏర్పాటు చేశారు. ఆయా బరుల వద్ద గుండాటల్లో భారీగా జనం తమ జేబులను ఖాళీ చేసుకున్నారు. కోడి పందేలు, గుండాటను తిలకించడానికి భారీగా జనం తరలివచ్చారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు కోడి పందేలను తిలకించారు. మహిళలు సైతం కోడి పందేలు కాయడం విశేషం. ఒక్కొక్క బరిలో 15 నుంచి 20 పందేల వరకు జరిగాయి. ప్రతి పందేనికి రూ.2 లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు పందేలు కాయడం కనిపించింది. పండగ మూడు రోజుల్లోను మండలంలో సుమారు రూ.ఐదు కోట్ల వరకు పందేలు జరిగాయని అంటున్నారు. అలాగే బరుల వద్ద యాంకర్ల పేరుతో అసభ్యకర నృత్యాలు కూడా జరిగాయి. కొన్నిచోట్ల హిజ్రాలతో నిర్వాహకులు డ్యాన్సులు నిర్వహించారు.

ఘనంగా ముగిసిన ధనుర్మాసోత్సవాలు


వేణుగోపాలస్వామి వారి గ్రామోత్సవం

పిఠాపురం: నియోజకవర్గంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా ముగిశాయి. నెల రోజులుగా వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, గోదాదేవి కల్యాణాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పంచమాధవ క్షేత్రమైన కుంతీమాధవస్వామి, వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో స్వామివారి గరుడ వాహనంపై గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన వేణుగోపాలస్వామి ధనుర్మాస వేడుకలు

పిఠాపురంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక ధనుర్మాస వేడుకల ముగింపు సందర్భంగా కనుమ పండుగ రోజు స్వామి వారికి విశేష సహస్రనామార్చన నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పుష్పమాలలతో అలంకరించిన గరుడ వాహనంపై ఉంచి, ఆలయం వద్ద నుండి కోటవారి వీధి, పెద్ద బజారు, సినిమా సెంటర్ మీదుగా తిరిగి ఆలయం వరకు గ్రామోత్సవం కొనసాగించారు. స్వామి సేవలో శ్రమించిన భోగిలకు వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధి సేవా సమితి ఆధ్వర్యంలో వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నున్న శ్రీరాములు, అర్చకులు విజయ జనార్ధనాచార్యులు, సేవా సమితి ప్రెసిడెంట్ చెరుకుపల్లి శ్రీనివాస్, శ్రీరామ్మోహన్, శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజసేవ సంఘం రాష్ట్ర సలహాదారు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో కొనసాగుతున్న గాలింపు

సామర్లకోట: గోదావరి కాలువలో దూకిన వ్యక్తి కోసం బుధవారం సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో గాలింపు కొనసాగుతోంది. ఈ మేరకు సలీమ్ బంధువులు, స్నేహితుల నుంచి సీఐ సమాచారం సేకరించారు. పెదపూడిలో లోకల్ పేపర్ విలేకరిగా పని చేస్తున్న షేక్ సలీమ్(36) ఈ నెల 9న రాత్రి స్థానిక రైల్వే గేటు ఎదురుగా ఉన్న నూతన వంతెన పైనుంచి గోదావరి కాలువలో దూకిన విషయం విదితమే. అప్పటి నుంచి బంధువులతో పాటు, పోలీసులు గోదావరి కాలువలో గాలింపు చేస్తున్నారు. వారం గడిచినా సలీమ్ ఆచూకీ లభించలేదని సీఐ తెలిపారు. అతడు మరణించి ఉంటే మృతదేహం కాలువలో తేలుతుందని పోలీసులు చెబుతున్నారు. మృతదేహం లభ్యం కాకపోవడంతో.. కాలువలో దూకిన వ్యక్తి ఈతకొడుతూ బయటకు వచ్చి ఉండవచ్చని భావిస్తుండగా, పోలీసులు కూడా దీనిని బలపరుస్తున్నారు. కాలువ నుంచి బయటకు వచ్చి ఉంటే, ఎవరికో ఒకరికి ఫోన్ చేయకుండా ఎలా ఉంటాడని సలీమ్ స్నేహితులు వాదిస్తున్నారు.


సామర్లకోటలో ఘటన స్థలం వద్ద సమాచారం సేకరిస్తున్న సీఐ

ఆటోలో మరిచిన బ్యాగ్ అందజేత


బ్యాగ్‌ను భార్యాభర్తలకు అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్సై గరగారావు

సామర్లకోట: పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో ఓ కుటుంబం మరిచిపోయిన బ్యాగ్‌ను బుధవారం గుర్తించిన పోలీసులు, వారికి అందజేసిన ఘటన ఇది. ట్రాఫిక్ ఎస్సై గరగారావు వివరాల మేరకు, గొల్లప్రోలుకు చెందిన వెంకటలక్ష్మి తన భర్తతో కలిసి విజయవాడ వెళ్లడానికి ఆటోలో సామర్లకోటకు వచ్చారు. ఆటో నుంచి వెంకటలక్ష్మి, ఆమె భర్త దిగిన వెంటనే ఆటో అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆటోలో బ్యాగ్ తీసుకోవడానికి అవకాశం దొరకలేదు. వెంటనే స్టేషన్ సెంటర్‌లో ఉన్న అవుట్ పోస్టు పోలీసు స్టేషన్‌లో ట్రాఫిక్ ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సీసీ కెమెరాను పరిశీలించి, ఆటో యూనియన్ వారికి సమాచారం ఇచ్చారు. ఆ ఆటో పిఠాపురానికి చెందిన బాషాదిగా గుర్తించారు. అతడి ద్వారా పోలీసులు బ్యాగ్‌ను తీసుకొచ్చి ఆ దంపతులకు అప్పగించారు.

నీలి సాగరంలో పాల కెరటాలు


కోనపాపపేటలో కనువిందు చేస్తున్న సముద్రం

కొత్తపల్లి: అలల ఉధృతితో భయానకంగా ఉండే సాగరం బుధవారం ప్రశాంతంగా దర్శనమిచ్చింది. సముద్రం నీలి వర్ణంలో మారి, ఉరకలెత్తిన పాల కెరటాలు సందర్శకులను అబ్బురపరచింది. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో లంగరు వేసిన బోట్లతో సాగర తీరం పర్యాటకులను కట్టి పడేసింది. సంక్రాంతి కావడంతో మత్స్యకారులు తమ బోట్లను సముద్రంలో లంగరు వేశారు. సముద్ర కెరటాలకు బోట్లు వయ్యారాలు ఒలకబోసినట్లు కనువిందు చేశాయి.

పూర్వ విద్యార్థుల కలయిక

కొత్తపల్లి: నాగులాపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన 2006–07లో టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పొన్నాడలోని బంగారు పాపమ్మ ఆలయం వద్ద బుధవారం జరిగింది. సుమారు 19 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు కలుసుకుని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు కృషి చేసిన తోటి స్నేహితులను అభినందించారు.

కోడా మజాకా..!

- పెద్దాపురం నియోజకవర్గంలో యథేచ్ఛగా కోడిపందేలు
- చోద్యం చూసిన పోలీసులు, ప్రజాప్రతినిధులు

పెద్దాపురం: సంక్రాంతి పండగ సందర్భంగా పందెంరాయుళ్లు నియోజకవర్గంలో ఎట్టకేలకు కోడిని గెలిపించారు. సంక్రాంతి మూడు రోజులు ఏటా కోడి పందేలు నిర్వహిస్తే, ఈ ఏడాది నాలుగు రోజుల పాటు నిర్వహణకు కూటమి నేతలు చర్యలు తీసుకున్నారంటూ ముమ్మర ప్రచారం చేశారు. దీనిపై అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. పందెరాయుళ్లు మాత్రం పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలనూ బేఖాతరు చేశారు. ఏం ఫర్వాలేదు, మనోళ్లు చూసుకుంటారంటూ కోడి పందేలు నిర్వహించారు. కోడి పందేల శిబిరాల్లోనే గుండాట, జూదాలు నిర్వహించారు. గుండాట, పెద్ద బజార్, చిన్నబజార్, బరుల వద్దే మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరిగాయి. ప్రతిచోటా మందుబాబుల హడావుడితో అక్కడక్కడా ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. పోలీసు యంత్రాంగం చూసీచూడనట్లు వదిలేసింది.


ఆర్‌బీ పట్నంలో నిర్వహిస్తున్న కోడి పందేలు

జోరుగా కోడి పందేలు, గుండాట

కొత్తపల్లి: మండలంలో నిబంధనలు అతిక్రమించి పలు గ్రామాల్లో బుధవారం కోడి పందేలు, గుండాట జోరుగా సాగాయి. మండలంలోని వాకతిప్ప, కొండెవరం, ఇసుకపల్లి, కొమరగిరి, పొన్నాడ, కొత్తపల్లి, పొన్నాడ, రమణక్కపేట, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో కోడి పందేలను మూడు రోజులుగా జోరుగా నిర్వహించారు. అంతేకాకుండా గుండాటను భారీగా ఏర్పాటు చేశారు. మూడు రోజులుగా లక్షల రూపాయలు చేతులుమారాయి.


వాకతిప్పలో నిర్వహిస్తున్న కోడి పందేలు


వాకతిప్పలో జరుగుతున్న గుండాట

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


సామర్లకోట సత్యనారాయణపురంలో విజేతలతో నిర్వాహకులు


ప్రజా సంఘాలు నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

సామర్లకోట: సంకాంత్రి సందర్భంగా మంగళవారం స్థానిక సత్యనారాయణపురంలో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సేపెని రూప ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేశారు. సుమారు 120 మంది ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు మార్ని విజయలక్ష్మి, సాయి ఐశ్వర్య మహిళా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కరణం శ్రీనివాసులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సేపెని సురేష్, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి బాబురావు, బావిశెట్టి భద్రరావు పాల్గొని, బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతి ప్రదానం

పట్టణంలోని విశ్వబ్రాహ్మణ మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ ప్రతినిధి, సినీ దర్శకుడు, నిర్మాత కోరుకొండ ఆనంద్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. విజేతలైన సాయి దీప్తి, కొత్తల హరిణి, కొచ్చెర్ల భావనకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. రెండు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. పోటీలో పాల్గొన్న వారికి హైకోర్టు న్యాయవాది వనమోజు రవి, ఉమాసుందిరి, కర్రి సత్యవెంకటేష్, వింజరపు ప్రకాశరావు చిరు కానుకలు అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆనంద్ తదితరులు

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

పెద్దాపురం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక వరహాలయ్యపేటలో డీవైఎఫ్ఐ, సీఐటీయూ, పీసీసీ ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, స్లో సైక్లింగ్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కూనిరెడ్డి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ తదితరులు ప్రసంగించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

గోపూజతో సుఖ సంతోషాలు

సామర్లకోట: గోవును పూజించడం ద్వారా సుఖ సంతోషాలు కలుగుతాయని, దోషాలు తొలగిపోతాయని పంచారామ క్షేత్రం అభిషేక పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ బుధవారం తెలిపారు. స్థానిక పంచారామ క్షేత్రంలో ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయంలోని నంది విగ్రహాలకు పట్టు వస్త్రాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ కంటే బాబు, భక్త సంఘ సభ్యులు బిక్కిన సాయి, తలుపుల అంజనీ కుమార్ నాతిపాముల సూరిబాబు పాల్గొన్నారు.


సామర్లకోటలో గోవులకు పూజలు చేస్తున్న రైతులు

అలాగే రైతులు తమ పొలాల్లోని గోవులకు పూజలు చేశారు.

ఘనంగా మకర జ్యోతి దర్శనం

కొత్తపల్లి: మకర సంక్రాంతి సందర్భంగా స్థానిక ధర్మశాస్తా ఆలయంలో మంగళవారం రాత్రి జ్యోతి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. స్వామి వారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం స్వామి ఆభరణాల అలంకరణ, అనంతరం జ్యోతి దర్శనం ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.



కొత్తపల్లిలో మకర జ్యోతి దర్శనం (అంతర చిత్రం) కొత్తపల్లిలో ధర్మశాస్తా ఆలయంలో అయ్యప్పస్వామి